క్లుప్తంగా

డ్వాక్రా మహిళలకు రూ.32.03 కోట్ల రుణాలు

● స్త్రీనిధి క్లస్టర్ మేనేజర్ రమేష్



మాట్లాడుతున్న స్త్రీనిధి క్లస్టర్ మేనేజర్ రమేష్, ఏపీఎం శ్రీనివాసరావు

బొబ్బిలి: డ్వాక్రా సంఘ సభ్యులుగా ఉంటూ వివిధ స్వయం ఉపాధి పథకాలను నిర్వహిస్తున్న 3,127 మంది డ్వాక్రా మహిళలకు రూ.32.03 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేసినట్లు స్త్రీ నిధి క్లస్టర్ మేనేజర్ కె. రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయాన్ని సందర్శించి డ్వాక్రా మహిళల ఆర్థిక స్థితిగతులను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, డ్వాక్రా సంఘ సభ్యులకు మంజూరు చేసిన రూ.32 కోట్ల రుణాల్లో ఇప్పటివరకు 23.98 కోట్ల రూపాయలను సభ్యుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఆర్థిక సంవత్సరం 2023–24 పరిధిలో మంజూరు చేసిన ఈ రుణాల్లో ఇప్పటికే 92 శాతం పైబడి రికవరీ చేశామన్నారు. వచ్చే మార్చిలోగా 99 శాతం రికవరయ్యే అవకాశాలున్నాయన్నారు. ఆయనతో పాటు ఏపీఎం పి. శ్రీనివాసరావు, సీసీలున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

తెర్లాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని లోచర్లలో బుధవారం గ్రామ వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచార మాధ్యమాలపై ప్రచారం నిర్వహించారు. అనంతరం సంకల్ప యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిర, పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చింతాడలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

బొబ్బిలి: మండలంలోని చింతాడలో 'ఏపీకి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలంటే' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, సర్పంచ్ బంకురు తిరుపతిరావు, తదితరులు పాల్గొని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగురవేశారు.

యూటీఎఫ్ వితరణ

బాడంగి: ఎంఆర్‌సీ భవనంలో వినియోగించేందుకు యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ తరఫున ఎంఈఓల ద్వారా టేబుల్ క్లాత్, డైరీలు, పెన్నులు, స్టాండ్‌లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి చేతుల మీదుగా వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎంఈఓలు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు జి. జీవరత్నం, జనరల్ సెక్రటరీలు రామరావు, ఎస్వీ రమణ, ట్రెజరర్ చొక్కాపు రాము, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

రేగిడి: బ్యాంకులు తీసుకున్న రుణాలు ప్రతీ నెల క్రమం తప్పకుండా చెల్లించాలని ఏపీఎం బి.గోవిందరావు డ్వాక్రా సంఘాల మహిళలకు సూచించారు. మండలంలో వావిలవలస, చిన లింగాలవలస, పెదలింగాలవలస, వావిలవలస, తోకలవలస గ్రామాల్లో సంఘాల మహిళలతో బుధవారం సమావేశం నిర్వహించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్

రాజాం: రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే రాజాం పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. పట్టణంలోని 24 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో బుధవారం పరిచయ కార్యక్రమం ఏర్పాటుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేస్తున్నారని, రాజకీయంలో సరికొత్త విప్లవాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. తనకు రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతను అప్పగించి పార్టీ, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ పోతానని రాజాం పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాజాం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషిచేయాలని, తనకు సహకరించాలని కోరారు. అంతకుముందు నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులను కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు జగనన్న

● ఇచ్చిన ప్రతీ హామీనీ అమలు చేసిన మనసున్న మారాజు
● పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛను కానుకను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: పేదల కష్టాలు తెలిసిన నాయకుడు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన పింఛన్ల పంపిణీలో మూడు వేల రూపాయలకు పెరిగిన పింఛన్‌ను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వందకు పైగా పథకాలను సమర్థవంతంగా అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మాజీ సీఎం చంద్రబాబు తన పాలనలో మహిళలు, వృద్ధులు, యువతను మోసం చేశాడని ఆరోపించారు. గతంలో ఉద్యోగాలను సైతం అమ్ముకున్న ఘనత చంద్రబాబుది అయితే.. నేడు లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు సుమారు లక్షా 65 వేల కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదేనని స్పష్టం చేశారు. గతంలో ఎవరైనా చనిపోతే ఆ స్థానంలో పింఛన్లు ఇచ్చేవారన్నారు. ఇప్పుడు అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరవుతోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మేలు మరువలేను..



నేను పేద మహిళను. నాకు ఆసరా వర్తిస్తోంది. ఇటీవల వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ కోసం పేరు నమోదు చేశాడు. ప్రస్తుతం పింఛన్ మంజూరైంది. జగన్ బాబు మేలు మరువలేను. ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలి.

– బారు సత్యవతి, తారకరామా కాలనీ, బొబ్బిలి.

వితంతు పింఛను మంజూరైంది..



నాకు ఏ ఆధారం లేదు. నాకు పింఛను మంజూరు చేయాలని మా కౌన్సిలర్ బాబు వలంటీర్‌కి చెబితే ఆయన వచ్చి వివరాలు తీసుకున్నాడు. ప్రస్తుతం పింఛన్ మంజూరైంది. నాకు చాలా ఆనందంగా ఉంది.

– కోన దాడెమ్మ, 16వ వార్డు, బొబ్బిలి

మాట తప్పని వ్యక్తి సీఎం జగన్



సంతకవిటి: లబ్ధిదారు కెంబూరు నారాయణమ్మకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
● కొండగూడేంలో పింఛన్ల పంపిణీ

సంతకవిటి: ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొండగూడేం గ్రామంలో బుధవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘ ప్రజా సంకల్పయాత్రలో అవ్వాతాతల కష్టాలు తెలుసుకుని అధికారంలోకి వస్తే పింఛన్ రూ.3 వేలకు పెంచుతామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలు చేయడం జరిగిందన్నారు. ఒకటో తేదీన ఉదయమే వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ డబ్బులు చేరవేస్తున్నామన్నారు. అదే టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు మానుకొని పింఛన్ల కోసం రోజుల తరబడి వేడి చూసేవారని గుర్తుచేశారు. రాజాం నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం రూ.7 కోట్లు ఖర్చు చేస్తే, అదే మన ప్రభుత్వంలో పింఛన్ల కోసం రూ.12 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. గత టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు తేడాను ప్రజలు తెలుసుకోవాలని కోరారు. ప్రజలందరూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన తలే రాజేష్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణకు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్. జగన్మోహనరావు, ఎంపీపీ మంజు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, సర్పంచ్ కె.వెంకటప్పలనాయుడు, ఎంపీటీసీ కె.అప్పారావు, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రాజాం వైస్ ఎంపీపీ వర్షిణి, పలాస వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, సంతకవిటి మండల ప్రత్యేకాధికారి సుమబాల, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

సంతకవిటి: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం అని మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొండగూడేం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను బుధవారం ఆయన ప్రారంభించారు. జగనన్న ప్రభుత్వంలో గ్రామ స్థాయిలోనే ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ కాలనీ స్థలాలపై పూర్తయిన విచారణ

● నివేదిక వెల్లడించిన ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ఇళ్ల స్థలాలపై సమగ్ర విచారణ పూర్తయిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాలనీలో ఎన్ని స్థలాలున్నాయి? ఎంతమంది నిర్మాణాలు చేపట్టారు.. ఎన్ని స్థలాలు ఖాళీగా ఉన్నాయన్న వివరాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నివేదిక రూపంలో అందజేశారన్నారు. ఇందిరమ్మ కాలనీలో స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని.. కాలనీ లే అవుట్ అపసవ్యంగా ఉందన్న విమర్శలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు ఆదేశించినట్లు తెలిపారు. 16 సంవత్సరాల కిందట ఏర్పాటైన ఇందిరమ్మ కాలనీలో 2,459 ఇళ్ల స్థలాలకు గాను 1424 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. మరో 479 స్థలాల్లో పునాదులు వేశారని, మిగిలిన 556 ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ వివరాలన్నీ విచారణ నివేదికలో కలర్ కోడ్‌లతో కలిపి పొందుపరచిన అధికారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఖాళీగా ఉన్న ఈ ఇళ్ల స్థలాలను అర్హత ఉన్నా ఇంకా పొందలేనివారికి, కోర్టు పరిధిలో ఉన్న రామన్నదొరవలస జగనన్న కాలనీ లబ్ధిదారులకు (398మంది) ఇవ్వడానికి నిర్ణయించినట్లు చెప్పారు. స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, న్యాయవాది మజ్జి జగన్నాథరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కాలనీ మ్యాప్‌ను చూపిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

మాట నిలబెట్టుకున్న నాయకుడు జగన్..

● ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: సంక్షేమ పథకాల అమలులో వంద శాతం మాట నిలబెట్టుకున్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి ఒక్కడేనని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీని కాకినాడలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బుధవారం ప్రారంభించిన కార్యక్రమాన్ని ఎంపీపీ, తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, తదితర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాదీ ముఖ్యమంత్రి జగనన్న పెన్షన్ పెంచుతున్నారన్నారు. మండలంలో పాత, కొత్త వారు కలిపి దాదాపు 7,937 మందికి నెలకు సుమారు రూ.2.37 కోట్లను పెన్షన్ రూపంలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం మాది ..

బొబ్బిలి: మాట తప్పని, మడమ తిప్పని ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కాకినాడలో నిర్వహించిన పింఛన్ల పెంపు కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న మాట ఇచ్చారంటే కచ్చితంగా నెరవేరుస్తారని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

ఆడ బిడ్డను కాపాడండి..

బాడంగి: ఆడబిడ్డలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంఈఓ –2 రాజేశ్వరి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థినులకు మండల స్థాయిలో బుధవారం వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి 25 మంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ –1 లక్ష్మణదొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం..

రామభద్రపురం: బాలికా సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ తిరుమల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 'ఆడపిల్లలను రక్షించుకుందాం' అనే అంశం వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రామభద్రపురం, కొట్టక్కి,నాయుడువలస, తదితర పాఠశాలలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో ఎ.శరత్‌నాయుడు, ఎ.మేఘన.. వక్తృత్వ పోటీలో ఈ. నాగేశ్వరిదేవి, వి. నిహారిక.. చిత్రలేఖనంలో ఎస్. మేఘనాథ్, ఎ.లిఖిత విజేతలుగా నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 6న విజయనగరం సాంస్కృతిక కళాశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



బాడంగి ఎంఆర్‌సీలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీడీఓ రమామణి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోందని, ఈ క్రమంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రమామణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీలతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఫేజ్–2 అమలు చేయనుందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో తమ పరిధిలోని ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని ఆరోగ్య శిబిరాలకు వచ్చేలా చూడాలన్నారు. ఈ నెల 5న రామభద్రపురం సచివాలయం–1.. 12న బూసాయవలస.. 30న తారాపురం.. ఫిబ్రవరి 6న జన్నివలస.. 13న సోంపురం.. 20న నాయుడువలస.. మార్చి 5న పాతరేగ.. 12న రొంపల్లి.. 19న దుప్పలపూడి.. ఏప్రిల్ 2న గొల్లపేట.. 16న కోటశిర్లాం.. 26న రామభద్రపురం–3.. మే 3న రావివలస.. 14న కొండకెంగువ.. 21 కొట్టక్కి సచివాలయాల పరిధిలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైద్యులకు సూచించారు. పట్టణంలోని సురేష్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎదురుగా ఏర్పాటుచేసిన లోటస్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సెంటర్‌లో అందించే ఎంఆర్ఐ స్కాన్, టీఎంటీ, డిజిటల్ ఎక్సరే, ఇతర ల్యాబ్ టెస్టుల వివరాలను అక్కడి వైద్యులు డాక్టర్ ఎలకల సురేష్‌కుమార్, డాక్టర్ టి.శుభదర్శిని జెడ్పీ చైర్మన్‌కు వివరించారు. రోగులకు సకాలంలో నాణ్యమైన సేవలు అందించాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లోటస్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

● క్రీడా సందడి...

క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వివిధ రకాల క్రీడల్లో క్రీడాకారులు పోటాపోటీగా తలపడుతున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలను నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నారు.



వంగర: కొప్పరలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ



బొబ్బిలి: మెట్టవలసలో కబడ్డీ పోటాలో కూతకు వెళ్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్

సావిత్రిబాయి స్ఫూర్తి ప్రదాత..

ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే యువతకు స్ఫూర్తి ప్రదాత.. ఆ రోజుల్లోనే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొని తనకు ఎంతో ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, ఎంతోమంది మహిళలను చైతన్య పరిచిన ధీశాలి.. మూఢ నమ్మకాలను పారదోలి.. మహిళల చదువుకు ఎంతో కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా బుధవారం ఘనంగా జరుపుకున్నారు.. ఈక్రమంలో పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు సావిత్రిబాయి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



రామభద్రపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాలికి పండ్లు అందజేస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్న హెచ్‌ఎం నాగభూషణరావు



రాజాం సిటీ: సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పాలవలస శ్రీనివాసరావు, తదితరులు



బాడంగి : ప్రభుత్వ కళాశాలలో మహిళా అధ్యాపకులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్,సిబ్బంది



బొబ్బిలి: అలజంగిలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



రాజాం: పెనుబాక పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం మహేశ్వరరావు, ఉపాధ్యాయులు

సంక్షిప్తంగా...

పోలీసుల సహకారంతో చెత్త తొలగింపు

రాజాం సిటీ: పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో పేరుకుపోయిన చెత్తను పోలీసుల సహకారంతో తొలగిస్తున్నామని కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. పట్టణంలోని సత్యనారాయణపురం కాలనీలో చెత్తను అదనపు సిబ్బందిచే తొలగించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో సమ్మె చేస్తున్న కార్మికులంతా అక్కడకు చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పాటు చెత్త తొలగింపును అడ్డుకున్నారు. పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా చెత్తను తొలగిస్తున్నామని, అంతా సహకరించాలని కమిషనర్ కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ బాసూరి శంకరరావు బుధవారం పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు ఉన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక

రాజాం సిటీ: స్థానిక బెహరా బాప్టిస్ట్ చర్చిలో బుధవారం రాజాం మండల ఫాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా వి.ప్రభుకుమార్, అధ్యక్షులుగా డాక్టర్ కె.కుమార్‌రాజు, కార్యదర్శిగా కె.పాల్‌తోపాటు సభ్యులు ఎన్నికయ్యారు.

పశువులకు టీకాలు

రాజాం సిటీ: పాడి రైతులు పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏడీ బి.జయప్రకాష్ అన్నారు. పట్టణ పరిధిలోని పొనుగుటివలసలో పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. పశువులకు రోగాలు సోకకుండా పాడిరైతులు ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు.

రెండు ఉద్యోగాలతో సత్తా చాటిన నరేష్

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామానికి చెందిన పువ్వల నరేష్ ఐడీబీఐ పీఓగా, రూరల్ రీజనల్ బ్యాంక్ క్లర్క్‌గా ఒకేసారి రెండు ఉద్యోగాలను సాధించి సత్తా చాటాడు. నరేష్ తండ్రి కృష్ణమూర్తి రైతు కాగా తల్లి లక్ష్మి గృహిణి.

03బిబిఎల్09:నరేష్

మధ్యాహ్న భోజనం పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ వై.దుర్గారావు బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనాలు వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం అప్పలస్వామి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

తెర్లాం: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా అవసరమైన టీకాలు వేయాలని మండల వైస్ ఎంపీపీ రమాదేవి అన్నారు. మండలంలోని పెరుమాళిలో మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. టీకాలు వేసే కార్యక్రమాన్ని మండల వైస్ ఎంపీపీ రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సీజన్‌లో ఎక్కువగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం టీకాలు వేస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు, పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు, గ్రామ పశుసంవర్థక శాఖ సహాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వలసలు నివారణకు 'ఉపాధి'

రేగిడి: మండలంలో వలసలు లేకుండా అన్ని గ్రామాల్లో వేతనదారులకు ఉపాధి పనులు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలో కొమెర, వెంకటాపురం తదితర గ్రామాల్లో మేట్లకు బుధవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి కొలతలు ప్రకారం పనులు చేయించి, ప్రభుత్వం అందిస్తున్న వేతనం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.